క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): హరనాథపురం సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని హరనాథపురం ఏఈ దామోదర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్థసారథినగర్, అకుతోట దళితవాడ, హరనాథపురంలోని అన్ని వీధులు, ఎక్స్‌టెన్షన్ ఏరియా, సర్వేపల్లి కాలువకట్ట, ఆదిత్యనగర్, అపోలో ఆస్పత్రి, తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

మహిళలు హాజరయ్యేలా చూడాలని వినతి



నెల్లూరు(పొగతోట): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు మహిళలందరూ హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఏపీ ఎన్జీఓ నేతలు కోరారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ చిరంజీవికి వినతిపత్రాన్ని శనివారం సమర్పించారు. అసోసియేషన్ నేతలు పెంచలయ్య, పావని, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటికి మద్దతుగా ప్రచారం



నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి విజయానికి పట్టభద్రులు కృషి చేయాలని పార్టీ నేతలు కోరారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు పడారుపల్లిలో ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. పార్టీ 21వ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, కార్పొరేటర్లు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నేతలు పుల్లారెడ్డి, మస్తాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు (టౌన్): వేదాయపాళెంలోని స్వర్ణదీపం చారిటబుల్ ట్రస్ట్‌కు నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు. వాసు, లక్ష్మి మనవడు ధార్మిక్ నందన్ జన్మదినాన్ని పురస్కరించుకొని వీటిని అందజేశారు. మునీంద్ర, ఉమామహేశ్వరి, తదతరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ ఈఎస్ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు (క్రైమ్): ఎస్ఈబీ ఈఎస్‌గా రవికుమార్ బీవీనగర్‌లోని కార్యాలయంలో బాధ్యతలను శనివారం స్వీకరించారు. గూడూరు ఈఎస్‌గా పనిచేస్తున్న ఈయన కొంతకాలంగా నెల్లూరు ఇన్‌చార్జి ఏసీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన బదిలీల్లో నెల్లూరు ఈఎస్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ క్రమంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం ఎస్పీ విజయారావు, ఎస్ఈబీ జిల్లా అధికారి శ్రీనివాసాచారి, ఏఎస్పీ హిమవతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

వివాహితకు న్యాయం చేయాలని వినతి

నెల్లూరు(క్రైమ్): భర్త వేధింపులకు గురవుతున్న వివాహితకు న్యాయం చేయాలని దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ సీతారామయ్యకు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. పోస్టల్ కాలనీకి చెందిన రాధాకు తన భర్త ప్రసాద్‌తో విభేదాలున్నాయని, దీంతో కొంతకాలంగా ఆమెను వేధింపులకు గురిచేస్తున్నారని ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

హ్యాండ్‌బ్యాగ్ కత్తిరించి నగల అపహరణ

నెల్లూరు(క్రైమ్): మహిళ హ్యాండ్‌బ్యాగ్‌ను కత్తిరించి నగలు, నగదును అపహరించుకెళ్లిన ఘటన ట్రంక్‌రోడ్డులో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం మొగళ్లపాళేనికి చెందిన సంపూర్ణ పెళ్లి వస్తువులను కొనుగోలు చేసేందుకు గానూ నెల్లూరొచ్చారు. ఎమ్వీఆర్ షాపింగ్ మాల్లో కొన్ని బంగారు, వెండి వస్తువులను కొనుగోలు చేసి హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకున్నారు. అక్కడి నుంచి ట్రంక్‌రోడ్డులోని కోమల విలాస్ హోటల్ వద్దకు వచ్చి హ్యాండ్‌బ్యాగ్‌ను చూడగా కత్తిరించి ఉంది. అందులో ఉన్న సుమారు రూ.రెండు లక్షల విలువజేసే మూడు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదును కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో పెండింగ్ పనుల పూర్తి



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని పలు డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న పనులను ఎన్నికల కోడ్ పూర్తయిన వెంటనే ప్రారంభించి త్వరలో పూర్తి చేస్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని మూడో డివిజన్లో గల మధురానగర్, రాజీవ్‌గాంధీ కాలనీ, తదితర ప్రాంతాల్లో శనివారం పర్యటించిన ఆయన అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మధురానగర్, రాజీవ్‌గాంధీ కాలనీలో డ్రెయిన్లు, సింహపురి కాలనీ, రాజీవ్ గాంధీ కాలనీ, న్యూ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, సింహపురి కాలనీలో కల్వర్టులు, తదితర పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఏయే సమస్యలున్నాయో ప్రజలను అడిగి తెలుసుకునేందుకు కార్పొరేటర్లు పర్యటించనున్నారని తెలిపారు. కార్పొరేటర్ అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్ల లక్ష్యాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: ఆస్తి, కుళాయి పన్ను వసూళ్లను వేగవంతం చేసి లక్ష్యాలను సచివాలయ కార్యదర్శులు సాధించాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. 38వ డివిజన్లోని అక్కన్నవారివీధిలో గల వార్డు సచివాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి వీధిలో లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం



చిరు ధాన్యాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

నెల్లూరు(సెంట్రల్): చిరు ధాన్యాలతో ఎంతో ఆరోగ్యం లభిస్తుందని కృషి విజ్ఞాన కేంద్ర ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ లలితా శివజ్యోతి పేర్కొన్నారు. బీవీనగర్‌లోని కేవీకేలో చిరు ధాన్యాలపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాదిని ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్‌గా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందని తెలిపారు. అనంతరం పలువురికి చిరుధాన్యాల ప్యాకెట్లను పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు సుమతి, సుజాత, కిరణ్‌కుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్‌నాయక్, లోకేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌రాజ్ విజయం సింహపురికి గర్వకారణం



నెల్లూరు(బృందావనం): జాతీయ స్థాయి కార్ రేసింగ్‌లో విజయ్‌రాజ్ విజయం నెల్లూరుకు గర్వకారణమని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. చెన్నైలో ఇటీవల నిర్వహించిన ఎమ్మారెఫ్ – 1300 ఫార్ములా కార్ రేసింగ్‌లో నేషనల్ చాంపియన్‌షిప్‌లో ప్రథమస్థానం సాధించిన విజయ్‌రాజ్‌ను గాంధీబొమ్మ సమీపంలోని 25 కళా సంఘాల కార్యాలయంలో శనివారం అభినందించారు. విజయ్‌రాజ్ తండ్రి స్వప్న విజయ్‌రాజ్, మలయాళీ అసోసియేషన్ సభ్యుడు నందకుమార్, చైర్మన్ మురుగన్, వైస్ ప్రెసిడెంట్ ప్రమోద్, ట్రెజరర్ మధు, కళాసంఘాల కన్వీనర్లు అమీర్‌జాన్, భాస్కర్, వేళాంగణిరాజు, చిట్టిబాబు, నారాయణబాబు, తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ఎమ్మెల్యే నుంచి ప్రాణహాని..

- రక్షణ కల్పించాలని ఎస్పీకి వినతి



మాట్లాడుతున్న కృష్ణ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నుంచి ప్రాణహాని ఉందని.. ఆయన బారి నుంచి రక్షించడంతో పాటు తమపై పెట్టిన కేసుల నుంచి విముక్తి కల్పించాలని పలువురు టీడీపీ నేతలు కోరారు. ఈ మేరకు ఎస్పీ విజయారావుకు వినతిపత్రాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత సాబీర్‌ఖాన్ మాట్లాడారు. ఎమ్మెల్యే కనుసన్నల్లోనే తమ పార్టీ నేతలపై దాడులు జరిగాయని, క్షేత్రస్థాయిలో పరిశీలించి నిందితులను శిక్షించాలని కోరారు. హరికుమార్‌పై హత్యాయత్నం చేశామని దొంగ కేసు పెట్టారన్నారు. అనంతరం మాతంగి కృష్ణ మాట్లాడారు. ఎమ్మెల్యే, ఆయన అనుచరులు తనపై దాడి చేసిన విషయం అందరికీ తెలుసునని, కేసులో ఎమ్మెల్యేతో పాటు 11 మందిని నిందితులుగా ఎఫ్ఐఆర్‌లో చేర్చారని, ఇందులో ఐదుగుర్నే అరెస్ట్ చేశారని తెలిపారు. తనను హత్య చేయాలనుకున్న వారు ప్రజల్లో తిరుగుతున్నారన్నారు. టీడీపీ నేతలు రాజానాయుడు, పెంచలనాయుడు, సుధాకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

బైక్ చోరీ

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సిమెంట్, స్టీల్ వ్యాపారం చేస్తున్న తిరుపతి జిల్లా కోట క్రాస్‌రోడ్డుకు చెందిన మురళీమోహన్‌రెడ్డి తన తల్లి సులోచనమ్మను నగరంలోని ఓ హాస్పిటల్‌కు గత నెల 14న తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం చెన్నైకు ఆమెను తీసుకెళ్లారు. ఈ క్రమంలో తన ప్యాషన్ ప్లస్ బైక్‌ను నేషనల్ హైవే కార్యాలయ సమీపంలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీ గోదాము పక్కన నిలిపి వెళ్లారు. 19వ తేదీన వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఈ మేరకు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

కారు ఢీకొని వాహనచోదకుడికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): కారు ఢీకొనడంతో వాహనచోదకుడు గాయపడిన ఘటనపై సౌత్ ట్రాఫిక్ పోలీసులు కేసును శనివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కోటమిట్టకు చెందిన సమీర్ అహ్మద్ వేదాయపాళెం నుంచి ఇంటికి బైక్‌పై శుక్రవారం రాత్రి బయల్దేరారు. కొండాయపాళెం గేట్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఘటనలో సమీర్ అహ్మద్ గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై దాడి

నెల్లూరు(క్రైమ్): వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూ భార్యపై దాడి చేసిన ఘటనలో భర్తపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పడారుపల్లిలోని దండోరా కాలనీకి చెందిన విశ్రాంత తెలుగుగంగ ఉద్యోగి లక్ష్మయ్య కొంతకాలంగా ఓ మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తూ భార్య రత్నమ్మను వేధిస్తున్నారు. ఈ నెల రెండో తేదీ రాత్రి ఆయన, ఓ మహిళ, మరో ముగ్గురితో కలిసి ఇంటికొచ్చి రత్నమ్మపై దాడి చేశారు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు రావడాన్ని గమనించి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తికి చెందిన గేదె, దూడలను అపహరించడమే కాకుండా అతడ్ని కులం పేరుతో దూషించిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కోట మండలంలోని గూడలికి చెందిన చిన్నసుబ్బయ్య వైఎస్సార్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో తన ఇంటి ముందు కట్టి ఉంచిన గేదె, దూడను గుర్తుతెలియని దుండగులు 2020, డిసెంబర్ ఒకటిన అపహరించుకెళ్లారు. బాధితుడు గాలింపు చర్యలు చేపట్టారు. పొదలకూరు మండలం సూరాయపాళేనికి చెందిన అరుణమ్మ తోలుకెళ్లి గేదె కొమ్ములను కత్తిరించి రాపూరు మండలం యద్దెలమడుగుకు చెందిన వెంకటేశ్వర్లుకు విక్రయించారనే విషయం తెలిసింది. ఈ విషయమై బాధితుడు ప్రశ్నించగా, కులంపేరుతో దూషించి బెదిరించారు. దీంతో కోర్టును బాధితుడు ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో నిందితులపై ఎస్సీ, ఎస్టీతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

ఏపీజీఈఏ సమావేశం రేపు

నెల్లూరు (అర్బన్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సంఘం (ఏపీజీఈఏ), అనుబంధ సంఘాల నేతలతో సమావేశాన్ని ఆర్టీసీ సమీపంలోని ఏనుగు సుందరరామిరెడ్డి కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించనున్నామని సంఘ జిల్లా నేత రామ్‌ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. జిల్లా, తాలూకాల కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘ ఉద్యోగులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

అష్టలక్ష్మి మందిరంలో ఏడున పూజలు

నెల్లూరు(బృందావనం): సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిర ప్రాంగణంలో గల అష్టలక్ష్మి మందిరంలో లక్ష్మీజయంతిని మంగళవారం నిర్వహించనున్నామని మందిర ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ అజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణమహాలక్ష్మీదేవికి పంచామృతాభిషేకం, ఉత్సవమూర్తికి నాణేలతో అభిషేకం, లక్ష కుంకుమార్చన, రుద్రహోమం, అష్టలక్ష్మీ హోమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. పాల్గొనాలనుకునే వారు 94415 48655, 0861 – 3500294 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గృహ నిర్మాణ పనుల పరిశీలన



నెల్లూరు సిటీ: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు నిర్మిస్తున్న గృహాల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. హౌసింగ్ డేలో భాగంగా భగత్‌సింగ్‌కాలనీలోని జగనన్న కాలనీలో నిర్మాణ పనులను అధికారులతో కలిసి శనివారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. నిర్మాణ, అభివృద్ధి పనులను నిత్యం పర్యవేక్షించాల్సిందిగా వార్డు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. లేఅవుట్లలో విద్యుత్, తాగునీరు, కాలువలు, తదితర వసతులను కల్పించాలని పేర్కొన్నారు. ఉగాది నాటికి గృహాలను లబ్ధిదారులకు కేటాయించాలని చెప్పారు. కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, హౌసింగ్ కార్పొరేషన్ డీఈ దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభ



తరుణేష్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): విజయవాడలో నిర్వహించిన జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున గూడూరుకు చెందిన విద్యార్థి తరుణేష్ జాతీయ కాంస్య పతకాన్ని సాధించారని ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహర్ష, వేణు పేర్కొన్నారు. ఈ మేరకు తరుణేష్‌ను శనివారం అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. విజయవాడలోని శాతవాహన కళాశాల మైదానంలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి మూడు వరకు నిర్వహించిన 42వ సీనియర్ రికర్వ్ రౌండ్ జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో 1440 పాయింట్లకు గానూ 1238 సాధించారని వివరించారు. గుజరాత్‌లో ఈ నెల తొమ్మిది నుంచి 18 వరకు నిర్వహించనున్న ఎన్టీపీసీ ఆర్చరీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు.

వీధి కుక్కల కట్టడికి చర్యలు

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల బెడదను తొలగించేందుకు కమిషనర్ హరిత ప్రత్యేక చర్యలు చేపట్టారు. తమ ప్రాంతంలో నెలకొన్న వీధి కుక్కల సమస్యలను అధికారులకు తెలియజేసేందుకు గానూ వాట్సాప్ నంబర్ 95532 19996ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ – మెయిల్, సోషల్ మీడియా వేదికల ద్వారా సైతం తెలియజేయొచ్చని చెప్పారు. complaints.nelloremc@gmail.comకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుల మేరకు వీధి కుక్కలను పట్టుకొని మున్సిపల్ జంతు నియంత్రణ కేంద్రానికి తరలించి, స్టెరిలైజ్ చేసి టీకాలను వేయనున్నామన్నారు.

వైకుంఠపురంలో అన్నదానం



నెల్లూరు (అర్బన్): నగరంలోని వైకుంఠపురంలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. మాల్యాద్రి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని కుటుంబసభ్యుల సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్యాణి, సభ్యులు రాము, రాధ, తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అండగా ఉందాం



మాట్లాడుతున్న వెంకటనారాయణమ్మ

నెల్లూరు(అర్బన్): మానసిక దివ్యాంగులకు అండగా ఉంటూ ప్రభుత్వపరంగా సాయమందించాలని డీఆర్వో వెంకటనారాయణమ్మ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో శనివారం నిర్వహించిన మానసిక దివ్యాంగుల లోకల్ లెవల్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాలను అందించేందుకు గానూ మానసిక దివ్యాంగుల సమాచారాన్ని ఆన్‌లైన్లో పొందుపర్చాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ నాగరాజకుమారి, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరావు, జీజీహెచ్ డాక్టర్ శరత్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న మలోల

నెల్లూరు రూరల్: ఈ నెల 13న జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలని ఆర్డీఓ మలోల పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ అధికారులతో నెల్లూరు రూరల్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద ముందస్తు చర్యలు చేపట్టాలని, ఏమైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల నుంచి పోలింగ్ సామగ్రిని ఈ నెల 12న పొందాలని చెప్పారు. పోలింగ్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, సెక్టార్ సూపర్‌వైజర్లు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు.

కుమార్తె మృతి అనుమానాస్పదమని ఫిర్యాదు

- రెండు నెలల క్రితం వివాహిత మృతి
- ఖననం చేసిన కుటుంబసభ్యులు
- తహసీల్దార్ సమక్షంలో పోస్ట్‌మార్టం

నెల్లూరు(క్రైమ్): ఓ వివాహిత, ఆమె స్నేహితుడు ఆత్మహత్యయత్నానికి ఒడిగట్టారు. వివాహిత మృతి చెందడంతో కుటుంబసభ్యులు ఖననం చేశారు. రెండు నెలల తర్వాత తన కుమార్తె మృతి అనుమానాస్పదంగా ఉందని పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ సమక్షంలో మృతదేహానికి పోస్ట్‌మార్టాన్ని నిర్వహించారు. పోలీసుల సమాచారం మేరకు.. కసుమూరులోని ఇస్లాంపేటకు చెందిన మహబూబ్‌బాషా, హాజీరాబేగం దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె అఫ్రోజ్ (20) ఇంటర్మీడియట్ చదువుకునే సమయంలో అదే ప్రాంతానికి చెందిన గౌస్‌బాషాతో చనువుగా ఉండటంతో గమనించిన కుటుంబసభ్యులు ఆమెను మందలించారు. గతేడాది నవంబర్‌లో జ్యోతినగర్‌కు చెందిన షబ్బీర్‌తో ఆమెకు వివాహం చేశారు. అఫ్రోజ్ చెల్లెలు మొబీనా ప్రేమ వివాహం చేసుకొని శెట్టిగుంటరోడ్డులో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి నాలుగున అఫ్రోజ్ తన చెల్లెలి ఇంటికెళ్లారు. అదే రోజు గౌస్‌బాషా అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో వారు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. మరుసటి రోజు ఉదయం బెడ్‌రూమ్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్న తన అక్క, గౌస్‌బాషాను గమనించిన మొబీనా విషయాన్ని తన తల్లికి తెలియజేశారు. ఆమెను లేపేందుకు యత్నించగా, అప్పటికే మృతి చెంది ఉండటంతో చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు గౌస్‌బాషాను తరలించారు. హాజీరాబేగం తన అల్లుడికి విషయాన్ని తెలియజేశారు. నెల్లూరుకు చేరుకొని గుట్టుచప్పుడు కాకుండా అఫ్రోజ్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లి ఖననం చేశారు. కాగా తన కుమార్తె మృతి అనుమానాస్పదంగా ఉందంటూ నవాబుపేట పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసును ఎస్సై తిరుపతయ్య నమోదు చేశారు. ప్రభుత్వ వైద్యులతో కలిసి ఇస్లాంపేటకు నెల్లూరు తహసీల్దార్ నిర్మలానందబాబు చేరుకున్నారు. తహసీల్దార్ సమక్షంలో మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు పోస్ట్‌మార్టం చేశారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా లైన్‌మెన్ దినోత్సవం



పురస్కారాలను అందుకున్న లైన్‌మెన్లతో అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో మొదటిసారిగా లైన్‌మెన్ దినోత్సవాన్ని నగరంలోని విద్యుత్ భవన్‌లో గల స్కాడా కార్యాలయంలో ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య మాట్లాడారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డిని అభినందించారు. అనంతరం టౌన్ డివిజన్లోని 11 సెక్షన్లలో ఉత్తమ ప్రతిభ చూపిన లైన్‌మెన్లకు సేవా పురస్కారాలను అందజేశారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీధర్, కిరణ్, డిప్యూటీ ఇంజినీర్లు మన్మథరావు, సుకుమార్, లక్ష్మీనారాయణ, సుధాకర్, దామోదర్, లక్ష్మీబాయి, చిన్నయ్య, వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ సెక్రటరీ శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ప్రియదర్శిని'లో క్యాంపస్ ఎంపికలు



నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ ఎంపికలను హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతినిధులు హరికృష్ణ, శివరామకృష్ణ శనివారం నిర్వహించారు. దాదాపు 500 మంది బీటెక్, ఎంసీఏ విద్యార్థులు హాజరుకాగా, ఉద్యోగాలకు 100 మంది ఎంపికయ్యారు. వీరిని కళాశాల చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, సీఈఓ రాజాయాదవ్ అభినందించారు. ప్రిన్సిపల్ సోనాలీమన్నా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అజయ్‌వేలు, విభాగాధిపతులు సునీల్, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, నాగరాజా, సతీష్, రాజా, సాఫ్ట్ స్కిల్స్ ట్రెయినర్లు రజనీకుమారి, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న మహేశ్వరుడు

నెల్లూరు(సెంట్రల్): పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు పేర్కొన్నారు. జిల్లాలోని డీడీలు, ఏడీలతో స్థానిక జేడీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ సంచార వాహనాలు, పశుదాణా వినియోగంతో పాటు గాలికుంటు వ్యాధికి సంబంధించి టీకాలను వేసే విషయమై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

సూర్యప్రభ వాహనంపై రంగడి విహారం



హంసవాహనంపై రంగనాథుడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో సూర్యప్రభ వాహనంపై రంగనాథుడు శనివారం దర్శనమిచ్చారు. హంసవాహనంపై కొలువై భక్తులను రాత్రి కటాక్షించారు. ఉభయకర్తలుగా వెంకటేష్, హేమ దంపతులు, సతీష్‌చంద్రగుప్తా, మాలిని దంపతులు వ్యవహరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో సింహవాహన, చంద్రప్రభ వాహనసేవలను ఆదివారం నిర్వహించనున్నామని ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి పేర్కొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అన్నమయ్య కీర్తనలను నెల్లూరుకు చెందిన గోపాల్ ఆలపించారు. కావలి శ్రీజయం కూచిపూడి నాట్యాలయ ఆధ్వర్యంలో కూచిపూడి ప్రదర్శనలు అలరించాయి.